

సారధి చిత్రమైన వ్యక్తి. వాడితో స్నేహం చెయ్యడం అందరికీ చాతకాదు.

ఈ కథ ప్రారంభంకాకముందు సారధి 'పెళ్ళి చేసుకోను' అన్నాడు. వాడు ఒకమాట అన్నాడూ అంటే అది నెరవేరి తీరవలసిందే. బొత్తిగా పట్టుదల మనిషి సారధి!

అలాంటి సారధి దగ్గర్నుంచి నాకో చిత్రమైన ఉత్తరం వచ్చింది.

ప్రియమైన రావ్!

ఇవ్వాళ మూర్తికిగూడా ఉత్తరం రాస్తున్నాను. నాకికి పెళ్లిచేసుకోవాలనే వాంఛ కలిగింది. దీనికి కారణం మీ రెండు కుటుంబాలే!

చివరికి మీరే గెలిచారు! శుభలేఖలు త్వరలో పంపుతాను. ప్రస్తుతానికి సెలవు. 'సి'

సారధి.

ఆశ్చర్యపోయాను.

గత నాలుగు సంవత్సరాలనుంచి 'పెళ్లిచేసుకో' మని సారధి చెవిదగ్గర ఇల్లుకట్టుకుని పోరాడాము నేనూ, మూర్తీను. వాడు వినలేదు సరికదా, మళ్లీ పెళ్లిమాట తనదగ్గ రంటే సహించేదిలేదని గూడా హెచ్చరించాడు.

మూర్తి, సారధి, నేనూ—ముగ్గురం ప్రాణ స్నేహితులం. క్లాసుమేట్సుమి.

తన కిష్టంలేనిపని తన పక్కనున్నవాడు చేసినా సహించలేడు సారధి. సర్దుకుపోయే మనస్తత్వం కాదు వాడిది. వాడివన్నీ చాలా చిత్రమైన 'సెంటిమెంట్సు.'

సహజంగా ప్రతివాడికీ వరదాయ్యైన షట్కం కాలేజీ జీవితం. కొన్ని హాబీల్లాటి గుణాలు అక్కడే ఉద్భవిస్తాయి. వాటిల్లో ముఖ్యమైనది—అందమైన ఆడపిల్లతో పరిచయం చేసుకుని దానిద్వారా వీలు దొరికినప్పుడల్లా కల్పించుకుని మాటాడ్డము. 'పైగా' ఫలానా అందమైన అమ్మాయితో నాకు పరిచయం ఉన్నది సుమా' అని చెప్పుకోడం పెద్ద 'క్వాలిఫికేషను' కూడాను.

ఈ పద్ధతి సారధికి నచ్చేదికాదు. మండిపడేవాడు.

మాకు ఈ ధోరణి కాస్త చిరాకు కలిగించేది. లేకపోతే ఫలానా అమ్మాయి అందంగా ఉంటుంది. సుమా అనిగాని, ఆ అమ్మాయితో నాకు పరిచయమున్నది తెలుసా అనిగాని — ఓ చిన్న ప్రశ్నవేస్తే దానికి పెద్ద రగడెందుకు? అయినా ఈ ముక్కలో మన్నించతగని తప్పేమున్నది గనుక?

సారధి కాబట్టి మాలో ఒకడిగా, ప్రాణసమానంగా తిరుగుతున్నాడు గనుక, వాడివాదాన్ని వింటూ సర్దుకుపోయాముగాని—మరొకడైతే మా స్నేహం కాస్తా అప్పటి కప్పుడే ముక్కలైపోయేది.

సారధి దృష్టిలో ఈనాటి కాలేజి విద్యార్థి చేస్తున్న ప్రతిపనీ నేరమే! చదువుకోడానికి వచ్చినవాను




చదువులోనే పరిపెట్టుకోవాలిగాని, ఇతర వ్యాపకాలు ఎందుకుంటాడు? అలాంటివాడు భ్రష్టుడంటాడు.

నా డింత సీరియస్‌గా వాదిస్తూంటె విని, వినిపించుకోనట్టు ఉండేవాళ్ళం. వాడికీ మాకూ వున్న స్నేహ సంబంధాని కిది చక్కటి నిదర్శన మవుతుంది.

మాతోనేకాదు; వాడి కుటుంబ వ్యవహారాల్లో కూడా సారథిపద్ధతి ఇల్లాగే ఉండేది. వాడికి చిన్న తనంలోనే తల్లిపోయింది. వాళ్ళనాన్న రెండోపెళ్ళి చేసుకున్నాడు. జూదం, తాగుడు మొదలైన వ్యసనాలు ఆయనకు ప్రాణాలు. అవే ఆయన లోకం. ఇది సహించేవాడుకాదు సారథి. ఒకటికి రెండుసార్లు సారథి చెప్పిచూశాడు ఇది మీకు తగదని. 'ప్రేలెడు లేవు నువ్వు(ట—నాకు చెప్పేది' అని ప్రోసివుచ్చా రాయన. అంతే—ఆ తండ్రీ కొడుకులమధ్య అను బంధం బీటలు వారింది.

అది ఎలాంటి పరిస్థితికి తీసుకొచ్చిందంటె—సంవత్సరానికి పదినెలలు బస్తీలోనే ఉండేవాడు సారథి. సెలవల్లో ఎప్పుడైనా ఇంటికి వెడితే ఒకటి రెండువారా లుండేసరికే వాడికి ప్రాణం పోయేంత పనయ్యేది. వెంటనే బయల్దేరి మళ్ళీ రూముకి వచ్చేసే వాడు. మిగిలిన సెలవంతా అద్దెగదిలోనే గడిపే వాడు.

నాలుగైదు తరాలవరకూ కూర్చునితిన్నా తరగని ఆస్తివల్ల సారథికి సుఖంలేదని చెప్పేవాడు. ఆ ఇల్లు నరకమనేవాడు. ఆయ నెప్పుడూ తాగి తందనా లాడుతూండేవాడుట. సవతితల్లి అసలు మాటా డేది కాదుట. అలాంటప్పుడు ఆ ఇంట్లో సుఖం ఎక్కడుందీ అంటాడు.

మేము చదువుకుంటూన్నరోజుల్లో — వాళ్ళనాన్న గారికి పక్షవాతం వచ్చింది. కబురు వచ్చినా గూడా సారథి ఇంటికి వెళ్ళలేదు. ఇదేమిటని అడుగుతే—

"నీచంగా ప్రవర్తించే మనుష్యులంటే—వాడు నాన్నగానీ, దేవుడుగానీ నా కిష్టంలేదు. ఒక్కనాడు కూడా నా ఆలనా పాలనా గురించి శ్రద్ధ తీసుకో లేదాయన. అమ్మ బ్రతికున్నరోజుల్లో, ఆవిడ నాకు ప్రాణాలు పెట్టేది. ఈయనెంత నీచంగా ప్రవ ర్తించినా, ఆవిడకోసమైనా నే నా ఇంట్లో ఉండక తప్పిందికాదు. ఇప్పుడు అమ్మలేదు. అమ్మతోపాటు నా కా ఇంటితో సమ్మంధం తీరిపోయింది" అన్నాడు.

సారథి రాతిగుండేమో అనిపించింది. కానీ, వాడు వ్యక్తి, ఆతనిశీలాలకు విలువలంటె ప్రాము ఖ్యత ఇస్తాడు. ఈ రకమైన మనస్తత్వం నాకు తారసపడిన ఏ మిత్రుడిలోనూ కాగడాపెట్టి వెతి కినా కనిపించలేదు.

—"కొందరుంటారు. వాళ్ళేది పట్టించుకోరు. ఇం కొందరు గాలికి ఎటుపడితే అటు ఊగుతూంటారు. బహుకొద్దిమందిమాత్రం ఇలా ప్రతి చిన్నవిష యానికీ పూర్వాపరాలు ఆలోచిస్తూంటారు రావ్. మన సారథి ఈ కోవకి చెందుతాడు. కాబట్టి—సాధ్యమైనంతవరకూ ఆమనిషితో అభిప్రాయ భేదాలు తెచ్చుకోకూడదు. అదో తరహాయని సరి



పెట్టుకుపోదాం" అనేవాడు మూర్తి.

అలాంటి సారథి ఓ నాడు ప్రేమించానన్నాడు అదిరిపడ్డాం. ఏదేవిటీ ప్రేమించడ మేమిటా ఆశ్చర్యపోయాం. వెనకటికి ముకుందం ఇలాగే అన్నా

# సారధి

"ప్రేమించానూ" అని. అప్పుడు సారధి నవ్వి,

"ఇలాంటి పదాలు వాడావంటే నాలిక తెగ్గోస్తాను జాగ్రత్త. ప్రేమంటే బజార్లో అమ్మే వంకాయలనుకున్నావట్రా?" అని కసిరికొట్టాడు.

మేమూ ఈ మాటనే వాడికి వప్పచెప్పుదామనుకున్నాంగాని, అనలేకపోయాం. ఎందుకనో మరి వాడి వాలకం చూస్తుంటే మొదట్నుంచీ ఒకరకమైన భయం మమ్మల్ని పట్టి పీడించేది.

తర్వాత కొన్నిరోజులకి వాడే చెప్పాడు—శారద తనని ప్రేమిస్తోందని. ఆవిడనుంచి ఈమాట విన్న తర్వాతనే తనూ ప్రేమిస్తున్నానని ఆమెకు చెప్పాట్ట. ఇది మరీ చిత్రమనిపించింది మాకు.

నేనే తెగించి అడిగాను చివరికి...

"అయితే నువ్వు ఆమెను ప్రేమించానంటావ్"

"ఆహా......"

"దాన్లో తప్పులేదంటావ్."

"అవునూ."

"కాని......"

"అడుగు. ఏమీ దాచుకోకు."

"మరి మే మెవర్నైనా—" చివర్ని ఆగిపోయాను పిసునాలో తోచక.

"నువ్వడగదలుచుకుంది తెలుసుకున్నాను. ఫలానా సుబ్బులక్ష్మి గురించి నువ్వు అనర్గళంగా మాటాడేస్తుంటే మండిపడ్డాను. అలాగే సరోజ అందంగా ఉంటుందని మూర్తి అన్నప్పుడు కసురుకున్నాను. కాని రావ్—నువ్వొక సంగతి మరచిపోతున్నావ్. మీరిద్దరూ ఇలా నోరు చేసుకొని వాగేస్తుంటే అవతలి వాళ్ల పరిస్థితి ఏంగాను? నువ్వు సుబ్బులక్ష్మిని, మూర్తి సరోజినీ ఆరాధించవచ్చు. అది మనసుల్లో పెట్టుకోండి. అంతేగాని నోరున్నదిగదా అని చాటింపు వేస్తే? నేను శారదని ఎప్పట్నుంచో ప్రేమిస్తున్నాను. అవుతే అంతమాత్రానికే ఆమె అభిప్రాయం తెలుసుకోకుండా బయటపడిపోతే ఫూల్‌నయ్యేది నేను. పైగా—అందరిలోనూ అభాసు. నావల్ల ఆ అమ్మాయిగూడా పదిమందిలోనూ రావటం ఏమి బావుంటుంది? ఇప్పుడు—నా అదృష్టంకొద్దీ శారదే అన్నది, నన్ను ప్రేమిస్తున్నానని."

ఆరోజు మూర్తీ, నేనూ ఇద్దరం వాడు చెప్పే ఉపన్యాసాన్ని శ్రద్ధగా చెవులప్పగించి విన్నాము. చివరికి దాని సారాంశం ఇది: ఎదటివాళ్లని దృష్టిలో పెట్టుకుని, మనం నడవాలిట. వాళ్ల మనసు కష్టపడేవిధంగా మనం ప్రవర్తిస్తే అది మన నేరమట.

స్థూలంగా చెప్పాలంటే మా సారధి ఓ పద్ధతికి బాగా అలవాటుపడ్డాడు. జీవితంలో పాటించాల్సిన నియమాలూ అంటూ కొన్ని ఏర్పాటుచేసుకున్నాడు. వాటినిదాటి ఒక్క అడుగైనా పొరపాటున వెయ్యడం వాడికి చేతకాదు.

ఇలాంటి సారధితో ఏ పొరపొచ్చాలూ రాకుండా ఆనర్సువరకూ చదువుకున్నాం. మేము తీసుకున్న జాగ్రత్తవల్ల ఇన్నేళ్ళ స్నేహంలోనూ, ఎన్నడూ అభిప్రాయభేదం రాలేదు. అందుకు ఇప్పటివరకూ గర్విస్తూంటాం.

యూనివర్సిటీ విడిచినతర్వాత సారధికి అన్యాయం జరిగింది. శారద సారధిని దగాచేసింది. మరెవనినో పెళ్లి చేసుకున్నది. ఇదేమిటని అడిగాడు సారధి. ఆమె తొణక్కుండా జవాబిలా చెప్పింది:

"ఎదగడం మనధర్మం. ఆరోజుల్లో నువ్వు నచ్చావ్. విలువ ఇచ్చాను. పెళ్ళిచేసుకోడానిక్కూడా ఒప్పుకున్నాను. కాని— గడచిన ఈ కొద్ది సంవత్సరాలలోనూ నా అభిప్రాయాన్ని మార్చుకోక తప్పింది కాదు. నా జీవితం ఓ అంతస్థులో జరపాలని నిశ్చయించుకున్నాను. నా అదృష్టంకొద్దీ అంతకుతగ్గ వరుడు దొరికాడు. నువ్వూ కాస్త ఆలోచించి చూడు. నీకంటె అతను అన్ని విషయాల్లోనూ ప్రయోజకుడు. కాదనలేవు. అందుచేతనే అతన్ని పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాను. ఇది తప్పా?"

ఈ జవాబుకి సారధి గతుక్కుమన్నాడు. మరి మనమనుకున్నదంతా ఏమైనట్లు? అని అడిగాడు. ఆమె ఫకాలున నవ్వింది మా సారధిఅమాయకత్వానికి.

"సత్యహరిశ్చంద్రునిచరిత్ర చదవడంవరకే సారధి! ఆచరించడం మనలాటి మనుషులకీ, ఈ కాలనికీ తలకుమించిన పని. అవకాశంకోసం మనం మనల్ని వంచించుకోవలసివస్తుంది. మరి తప్పదు. నీ మనసు బాధపడితే క్షంతవ్యురాలిని. ఇంక వృథా ప్రశ్నలతో విసిగించవనుకుంటాను."

---

**నిర్మాత: "నేతీయబోయే సినిమాలో నీకు ముసలాడివేషం ఇస్తాగాని నీ అడ్రసు ఇచ్చివెళ్లు."**

**నటుడు: "ముసలి వేషమా! నాకు పట్టుమని పాతికేళ్ళు లేవే"**

**నిర్మాత: "ఫరవాలేదులే! నే సినిమా తియ్యొచ్చేనాటికి నీకు ముసలితనం రాకపోదు"**

రామచంద్రయ్య (మదరాసు)

---

అంతే—ఆనాటితో మా సారధి పూర్తిగా మారిపోయాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ గడిపేవాడు. ఏదీ పట్టించుకునేవాడుకాదు. ఎవర్తోనూ ఆట్టే మాట్లాడేవాడుకాదు.

మాకు శారదపైన కోపం కట్టలు తెంచుకుంది. ఆమె చేసిన అన్యాయాన్ని హెచ్చరించి మందలిద్దామనుకున్నాం. కాని సారధి కూడదని అరికట్టాడు.

"మనల్ని మనం హెచ్చరించుకోవాలిసిందేగాని—పరాయివాళ్లను కాదు. మళ్లీ ఈ జీవితంలో ఎవర్నీ ప్రేమించలేను. అలా నన్ను తయారుచేసి వదిలిపెట్టింది శారద. ఈ పాఠాన్నిమాత్రం మరిచిపోలేను."

దీనికి తగ్గట్టు ఆ సంవత్సరంలోనే సారధితండ్రి పోయారు. సవతితల్లి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆస్తిని కైంకర్యంచేసుకోటానికి ప్రయత్నాలు సాగించిందని గూడా వార్త వచ్చింది. ఇదీ పట్టించుకోలేదు సారధి

వాడికి ఆత్మబంధువులమైనా, ప్రాణస్నేహితులమైనా—మిగిలింది నేనూ, మూర్తీను. మూర్తికి పెళ్లవుతున్నరోజుల్లో సారధిని అడిగాం! 'నువ్వూ పెళ్ళి చేసుకోరాదూ' అని. వాడు అడ్డంగా తలూపాడు.

"ఆడదాన్ని నమ్మకోడం నాకు భయం. ఇంతవరకూ జరిగిన శాస్తి చాలు. మళ్లీ ఆడదానిమాటెత్తకండి. నన్ను వంటరిగా ఇలా బ్రతకనివ్వండి చాలు" అన్నాడు.

నా పెళ్ళి గూడా జరిగింది. అప్పుడూ అడిగాం వాడిని, పెళ్లిచేసుకోమని. ఇంకోసారి ఇలా వేధించుకుంటే మీకూ, నాకూ రగడ రాకతప్పదు. జాగ్రత్త అని హెచ్చరించాడు.

అంతే—మళ్లీ ఆనాటినుంచీ వాడి పెళ్లి విషయం కదపలేదు. అయితే వాడు తీసుకున్న నిర్ణయానికి మాత్రం చింతించాం. ఇందుకు కారణభూతురాలైన శారదని మే మెన్నడూ క్షమించలేదు!

సారధి జీవితంలో లెక్చరర్‌గా స్థిరపడ్డాడు. వాడు అలాంటి ఉద్యోగాలకే తగును. చక్కగా పాఠాలు బోధించడంలో దిట్ట. త్వరలోనే పేరుప్రఖ్యాతలు తెచ్చుకుంటాడని ఆశించాము.

కాని—వాడు ఈ మలుపులోగూడా ఓడిపోయాడు. పాఠాలు చెప్పడం ఎలాగున్నా తన పద్ధతి మాత్రం మార్చుకోలేదు. క్లాసులో విద్యార్థులను ప్రతి చిన్న విషయానికీ మందలించేవాడుట. కొన్నాళ్లు ఓపిక పట్టారు. ఇంకా వాడి పద్ధతి మారకపోవడం చూచి రెచ్చిపోయారు. పబ్లిగ్గా క్లాసులోనే కేరింతాలూ, ఈలలూ వగైరా వెయ్యడం మొదలుపెట్టారుట. దాంతో సారధి అభిమానం దెబ్బతిన్నది. వాడి మందలింపు ఇంకాస్త పైస్థాయిలోకి పోయింది.

ఇదంతా గమనించి వాడికో పేరు పెట్టారుట గడుగ్గాయివిద్యార్థులు కొందరు—చాలా దారుణమైన పేరు 'హైడ్!'

మనిషిలో రాక్షసుడూ, దేవుడూ ఇద్దరూ ఉంటారు. ఒక్కోసారి దేవుడూ, మరోసారి రాక్షసుడూ ఇలా వంతులవారిగా దర్శనమిస్తుంటారు. అవుతే ఈ రంగుని అతి జాగ్రత్తగా పరిశీలించడంలోనే ఉన్నది చాకచక్యమంతాను.

సారధి పద్ధతి మేముకాబట్టి సరిపెట్టుకున్నాంగాని— అందరూ వాడిని హర్షిస్తారంటె వట్టిమాట. మావాడు వాళ్లందరికీ రాక్షసుడిలా కనిపించాడు కాబోలు 'హైడ్' అని నామకరణం చేశారు.

సారధి గురించి తెలుస్తున్న ఈ విషయా లన్నింటికీ మేము చింతించనిరోజు లేదు. అడుగడుక్కీ వాడు ఓడిపోతున్నాడు. వాడికి దురదృష్టం పగపట్టిన పాములా వెంటాడుతూ వున్నది.

అయిదారుసార్లు (సెలవల్లో) వాడు మా ఇద్దరి దగ్గరికీ రావడం జరిగింది. మా సంసారాలని క్షుణ్ణంగా పరిశీలించాడు. గర్వం కాదనుకుంటె ఈమాత్రం చెప్పగలను—మా అదృష్టమా అన్నట్టు నా భార్య రాజ్యలక్ష్మి, మూర్తిభార్య వసంతా—ఇద్దరివీ అమృతహృదయాలు. వాడొచ్చినప్పుడల్లా ఏలోటూ రాకుండా చక్కటి ఆతిథ్యం ఇచ్చారు. ప్రతిసారీ వాడువున్న వారంరోజుల్లోనూ వాడెప్పుడో పోగొట్టుకున్న సుఖాన్నీ, శాంతినీ పొందగలిగాడు. అప్పుడప్పుడూ ఉత్తరాల్లో రాస్తూండేవాడు—

"మీరిద్దరూ ఏనాడు పుణ్యంచేసుకున్నారో గాని, దేవతల్లాటి భార్యల్ని సంపాయించుకున్నారు. వాళ్లను చూస్తుంటె అనిపిస్తున్నది—స్త్రీలో వంచనే కాదు ప్రాణం పెట్టే అభిమానం కూడా ఉన్నదని. మీకూ, నాకూ స్నేహం ఉన్నది. మీరు నన్ను ఆద

## లాభదాయకమైన లఘు పరిశ్రమ ప్రారంభించండి


"అధునాతన కుటీర పరిశ్రమలు" (తెలుగు) పుస్తకంలో లాభదాయకమైన వివిధ పరిశ్రమలు వున్నాయి. ఈ పరిశ్రమలలో వున్నవారు చక్కటి లాభాలను ఆర్జిస్తున్నారు. ప్రతి పరిశ్రమను గూర్చి సంక్షిప్తమైన వివరాలు, ముడి పదార్థాలు లభించే చోట్లు, ముడి పదార్థాల కొనుగోలుకు, వాయిదాల పద్ధతిన యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం యిచ్చే సహాయం – యిందులో వున్నాయి. లఘు పరిశ్రమలు ప్రారంభించ దలచుకున్న వ్యక్తుల సమస్యలకు తగిన పరిష్కార మార్గాలు యిందులో వున్నాయి. పుటలు 878, సుమారు 800 బొమ్మలు, ధర రూ. 13/- తపాలరుసుము రూ. 1-50. Phone: 229835.

COTTAGE INDUSTRY, (WN-33),
P.B. 1262, Jamuna Road, Delhi - 6.



## బాధగా అసహ్యంగా వుండే గజ్జినుంచి త్వరగా బయటపడండి.

గజ్జి అంటువ్యాధి. అది మీ కుటుంబంలోని యితరులకు వ్యాపించకుండా వుండేందుకు ముందుగానే, మీరు అమృతాంజన్ లిమిటెడ్‌వారి డెర్మల్ ఆయింటుమెంటును వాడి త్వరగా, పూర్తిగా ఉపశమనం పొందండి. మళ్ళీ ఆ అంటువ్యాధి తల యెత్తకుండా వుండాలంటే, మీరు తగిన జాగ్రత్త తీసుకోవడం అవసరం. అమృతాంజన్ డెర్మల్ ఆయింటుమెంటు డబ్బా ఒకటి ఎప్పుడూ యింట్లో ఉంచుకోండి. అది తామరకూ, పాసినకాళ్లకూ కూడా పనికివస్తుంది.




## అమృతాంజన్ లిమిటెడ్ వారి డెర్మల్ ఆయింట్‌మెంట్

అమృతాంజన్ లిమిటెడ్ 14/15, లజ్‌చర్చి రోడ్డు, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ-1.

JWT AM/D/1749


# సారధి

రిస్తున్నారంటే, నా ప్రతిఎంయంటోనూ సలహాలు ఇస్తున్నారంటే అర మున్నది. వాళ్ళెవరు? నేనెవర్ని? నిజం రావ్......నాఎడల వాళ్ళు చూపిస్తున్న ఆదరణకి కరిగిపోతున్నాను. నాకోసం, నా శ్రేయస్సుకోసం ఇప్పుడు నలుగురున్నారు."

పెళ్లి చేసుకోమని మేమిచ్చిన సలహాని దూరంగా నెట్టి, మళ్ళీ ఆ మాటంటే సహించేదిలేదని చెప్పిన సారధి ఈనాడు ఇలా మారిపోటానికి కారణం రాజ్యలక్ష్మి, వసంతాను వాడు సెలవలో వచ్చినప్పుడు ఇద్దరూ అడిగారు. పెళ్లి చేసుకుని ఓ ఇంటివాడవై ఆనందాన్ని అనుభవించమని.

ఏది ఏమైనా మా సారధి పెళ్ళికి ఒప్పుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉన్నది. ఆఫీసునుంచి త్వరగా ఇంటికి వచ్చాను. బట్టలు మార్చుకుంటూండగా రాజ్యలక్ష్మి నా గదిలోకి వచ్చింది.

"శ్రీవారు ఇవాళ చాలా పెందరాళే వచ్చారే?"

"కారణం చెప్పుకో చూద్దాం."

రెండు క్షణాలు ఏదో ఆలోచించింది. ఆతర్వాత అందంగా కళ్ళు కదిపి, పెదవి విరుస్తూ అన్నది.

"ఊహూ.........మీరే చెప్పండి."

"అవుతేనువ్వోకపని చెయ్యాల్సి ఉంటుందిమరి."

"చెప్పండి."

"ఇవ్వాళ ఓ శుభవార్త పట్టుకొచ్చాను. అది చెప్పాలంటే నాకు అర్జంటుగా ఓ అందమైన కాఫీ కాచి పట్టుకురావాలి."

"ఇంచమన్నమాట."

"ఆహా.. ..అక్షరాలా అంతే లేకపోతే అంత తేలిగ్గా చెప్పే శుభవార్త కాదు. ఊ .కదులు .. .. క్షణంలో కాఫీ పట్టుకు రావాలి మరి. క్విక్"

రాజ్యం నవ్వుకుంటూ వంటగదిలోకివెళ్ళిపోయింది. మరో పదినిమిషాల్లో కాఫీకప్పుతో లోనికివచ్చింది. కాఫీ టీపాయ్‌మీద పెడుతూ, "ఊ ఇంకచెప్పండి" అన్నది తానూ ఓ కుర్చీమీద కూర్చుంటూ

నింపాదిగా కాఫీ తాగాను. వక్కపొడి వేసుకున్నాను. సిగరెట్టుతీసి ముట్టించుకోబోయాను. ఈ ఆలస్యానికి ఆమె చిరుకోపం ప్రదర్శించింది.

"అబ్బ... చంపేస్తున్నారు బాబూ... .చెప్పండి త్వరగా."

ఆమె ఆదుర్దాని పసిగట్టి మరింత ఆలస్యం చెయ్యాలనే ఉద్దేశ్యంకొద్దీ—

"కాస్త ఆగు మరి. సిగరెట్టు వెలిగించుకోవాలా?"

సిగరెట్టు ముట్టించి, గట్టిగా ఓ దమ్ములాగి నెమ్మదిగా పొగ వదిలాను ఆ పొగవంక అలా చూస్తూండిపోయాను. ఈ వరస గమనించిన రాజ్యం గబుక్కున కుర్చీలోంచిలేచి బయటికి వెళ్ళబోయింది.

"అరరె......వెళ్ళిపోతున్నావేమిటీ ఖర్మం; చెప్తున్నానుగా మరి. కూర్చో......"

"నాకేం చెప్పక్కర్లేదు. మీరే దాచుకోండి. లేకపోతేను ఆడించేస్తున్నారు మహా......"

"అబ్బో అంతకోపమైతే ఎలా? సారధి గురించి ఓ మంచివార్త తెలిసింది" అన్నాను.

ఈమాట అనంగానే ఆమె గబగబావచ్చి కుర్చీలో కూర్చుంది.

"ఏమిటది?" అని అడిగింది.

"మరేంలేదు. వాడు పెళ్ళిచేసుకోబోతూన్నాట్ట."

"నిజం?" ఆశ్చర్యంగా అడిగింది.

"కావాలిస్తే ఈ ఉత్తరం చదువు" అని సారధి రాసిన ఉత్తరం ఆమెకు ఇచ్చాను. రాజ్యం ఆ ఉత్తరం పూర్తిగా చదివింది.

"సారధికూడా ఓ ఇంటివాడు అవుతున్నాడు. పాపం! అనవసరంగా మధనపడ్డాడు. పోనీలెండి. ఈనాటికైనా ఒప్పుకున్నాడు. అదే చాలు."

* * *

సారధి పెళ్ళి సరిగ్గా వారంరోజు లుండగా మూర్తి తన శ్రీమతితోపాటు మా ఇంటికి వస్తున్నట్టు వైరిచ్చాడు. ఆ సాయంత్రం రాజ్యంతో పాటు స్టేషను కెళ్ళాను. వాళ్ళను రిసీవు చేసుకునేందుకు.

మూర్తివాళ్ళు రైలు దిగారు వాళ్ళనుచూచి చాలా కాలం అయ్యిందేమో—ఇప్పుడు కాస్త కొత్తగా కనిపిస్తూన్నారు. బాబిగాడు (మూర్తి సుపుత్రుడు) మునుపటికంటె బొద్దుగా, ముద్దుగా తయారయ్యాడు. వసంతచేతిలోంచి నన్ను చూడంగానే కేరింతాలు పెడుతూ నా దగ్గరకు వచ్చాడు. వాడి నెలా ఎత్తుకున్నానో, లేదో నా చేతిలోంచి వాడ్ని గబగబా లాక్కుని ముద్దులవర్షం కురిపిస్తోంది రాజ్యం.

"ఏయ్! ముందు వాడ్నిలా ఇవ్వు." అన్నాను.

"పోదురూ.....ఏరా బాబీ.. .మావయ్య చెడ్డోడు గదలా!" అన్నది వాడితో చంటిపిల్లలా.

మా ఇద్దర్నీ చూస్తూ మూర్తిదంపతులు ముసి ముసిగా నవ్వుకున్నారు

"నా అంతటివాడు నేనిలా ప్లాటుఫారమ్మీద నిలబడివుంటే వాడొక్కడే కానవస్తున్నా డా నీకు" అన్నాడు మూర్తి

"అన్నయ్యనైతే అన్నారుగాని, రాజ్యాన్ని చూడండి 'ఏవమ్మా కులాసా' అని పలుకరించడంమాని పసిపిల్లలా వాడితో ఆడుకోడం ఏమైనా బావుందా?"

"ఆ... నీది మరీ చాదస్తం. మాటకుముందు రాజ్యాన్ని దెప్పడం నేర్చుకున్నావ్."

వాళ్ళిద్దరి వాదాన్ని విని మేమూ నవ్వుకున్నాం!

ఇంటికొచ్చేసరికి చీకటిపడింది. స్నానాలూ వగైరా ముగించి రాజ్యం ఇచ్చిన కాఫీ తాగాం.

మూర్తి తాగుతూ అన్నాడు.

"నీచేతిలో అమృతముందమ్మా .. .ఎందుకూ మా ఆవిడా ఉన్నది శుద్ధ దండక్కి. ఆవిడచేతి కాఫీ తాగితే మళ్ళీ జన్మలో కాఫీముఖం చూడరాదనిపిస్తుంది. ఆ....."

"అరరే.... అలాగట్రా—మరిన్నాళ్ళనుంచీ ఎలా తాగుతున్నావో?"

"గతిలేక."

"ఒక్కోసారి 'వాసంతీ నీకు పుణ్యముంటుంది కాని, కాస్త కాఫీ ఇవ్వవూ ...నీ కాఫీ అమృతం వాసంతీ' అని అడుగుతా రన్నాయ్. అప్పుడేమయ్యిందో ఈ వైరాగ్యం? అదీ అడుగు."

"మరి దీనికి నీ జవాబేమిటోయ్ భగవాన్లూ" అని అడిగాను.

"నీకు తెలీందేముంది రా. రోజుకి రెండుమాట్లు కాఫీ అని మాకు రూలంటూ ఒహాటే ఏడ్చిందిగా. ఒక్కోప్పుడు పొద్దుప్రాణం నాలుగుసార్లు తాగూ అని అజ్ఞాపిస్తుంది. అలాంటప్పుడు 'తైరు' కొట్టకపోతే వాదనా? చెప్పు."

మా మాటల్లో మేముండగా ఒటు రాజ్యం బాబిగాడికి బిస్కట్లు వగైరా పెడుతూ, ఏవో ముద్దుమాటలు నేర్పుతుంది. ఇప్పటివరకూ వాడిని కిందికి దించితే వట్టు. ఇదంతా చూచి వాసంతి అన్నది—

"మా వదినకి వాడంటె ఎంత ఇదండి? ఇప్పట్నుంచే అల్లుడ్ని మంచి చేసుకుంటుంది కాబోలు. అలాగే కానివ్వు వదినా నీలాంటిపిల్లను కంటావో గాని అచ్చం అన్నయ్య పోలికలుమాత్రం ఉండా లమ్మోవ్.... .తర్వాత చెప్పలేదని దెప్పితేమాత్రం లాభంలేదు."

రాజ్యం తలదించుకుంది సిగ్గుతో.

—భోజనాలయ్యాయి. నేనూ, మూర్తి డాబా మీద పడుకున్నాం. నిద్రపోయేముందు కాలేజీ రోజులు గురించి చాలాసేపు మాటాడుకున్నాం. చివరికి మా సారధి పెళ్ళివరకూ సాగింది మా లోకాభిరామాయణం.

సారధిపెళ్ళికి మే మిద్దరమే పెళ్ళిపెద్దలం. అందుచేత ఓ నాలుగురోజుల ముందుగానే ప్రయాణ

"కొత్తమంత్రిగారు ఎలాంటి వారంటారు?"

"చెప్పలేం వారంలో ఆరు రోజులు ఆయ నసలు కనిపించనే కనిపించడు. ఏడో రోజు కని పిస్తాడుగానీ ఏం చెబుతున్నాడో అర్థంకాదు!"

హనుమంతరావు (గూడూరు)

మయ్యాము. వాడు మమ్మల్ని చూడగానే కళ్ళనిండా ఆనందం నింపుకుని అన్నాడు.

"ఒక వారంరోజులు ముందుగా రమ్మంటే ఇదా రావటం అసలు మీరు వస్తారో రారో అని ఇప్పటివరకూ ఎదురుచూస్తూన్నాను వచ్చారు. అదే చాలు. రండి......

రాజ్యంచేతిలోవున్న బాబిగాడు వాడివైపు చిత్రంగా చూశాడు "బాబాయిరా...... వెళ్ళు" అన్నది రాజ్యం.

సారధి బాబి నెత్తుకున్నాడు.

"అప్పుడే మరిచావుట్రా......రా...... నీకుబోలు బొమ్మలు కొన్నాను. చూద్దువుగాని రా......" అని గబగబా వాడి నెత్తుకుని లోనికి వెళ్ళిపోయాడు నలుగురమూ కాళ్ళు కడుక్కుని ఇంట్లోకి అడుగు పెట్టాము.

—సారధి తరఫున చుట్టాలంటూ ఎవ్వరూ రాలేదు. వాడి పెళ్ళికి మేము నలుగురమే పెళ్ళిపెద్దలయ్యాము. అర్ధ్రాత్రి కమ్మటి కబుర్లతో గడిపాం. తెల్లవారుజామున నాలుగున్నరకు రైలెక్కి ఆ ఉదయం పదిగంటలకు కాబోయే తెనాలి పెళ్ళివారింటికి చేరుకున్నాం.

సారధి మావగారు ఆ ఊళ్ళో పేరొందిన లాయరుట. ఇద్దరే సంతానం. మొదటమ్మాయికి ఆ క్రితం ఏడాదే పెళ్ళయింది. సారధితోపాటు పని చేస్తూన్న తోటి శేఖరంగారు ఈ సమ్మంధం తీసుకొచ్చారుట.

లాయరుగారు బాగా సంపాయించారు. ఆఊళ్ళో పెద్ద భవంతి ఒకటి కట్టించారు. ఆఊరులో పాతికెకరాలు దాదాపు భూమి కొన్నారుట. ఆయనకున్న పిల్లల నిద్దర్నీ బి. ఎ. వరకూ చదివించారు. మొదటమ్మాయిని గుంటూర్లో డాక్టరికిచ్చారు

పెళ్ళిపందిరి సందడిగా అందంగా ఉన్నది. మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా, పురోహితులు మంత్రాలు చదువుతూండగా—మా సారధి మాలతిమెళ్ళో మంగళసూత్రం కట్టాడు.

ఇప్పుడు సారధి ఓ ఇంటివా డయ్యాడు!

జీవితంలో ఓడిపోయాడనుకున్నాం. చింత పెట్టుకుని మిగిలిన జీవితంలో చిచ్చు చేతులారా తానే పెట్టుకున్నాడనుకున్నాం. వాడి కిహ వెలుగంటూ ఉన్నదా అని వాపోయాం. నేటికి వాడింట్లో దీపం వెలిగింది! జీవితంలో సుఖం దొరికింది!

మాలతిద్వారానైనా గతాన్ని మరచి, మళ్ళీ మనిషిగా తయారవుతాడు ఇది చాలు.

పెళ్ళిపందిట్లో, రాజ్యం, వాసంతిల హడావిడి ఇంతా అంతా కాదు. ఎక్కడ చూచినా వాళ్ళే. పెళ్ళికొడుకుతరఫున ముఖ్యమైనపాత్ర తీసుకున్నదీ వాళ్ళే—లాంఛనాలూ వగైరా గిట్టగాచెప్పి చేయించుకున్నారు. వీళ్ళద్దరి హంగామా చూస్తూంటె ఓపక్క నవ్వూ, మరోపక్క ఆనందమూ కలిగింది.

సారధిపెళ్ళి నిర్విఘ్నంగా జరిగింది! మూర్తి అన్నాడు—"ఈ పిల్లయినా మనవాడ్ని ఓదారికి తీసుకొస్తుందని ఆశిద్దాం. వాడి సుఖమంతా ఆమె చేతిలోనే వున్నది" నిజమే మరి

ఆ సాయంత్రం విడిదింట్లో నేనూ, మూర్తీ, సారధి పిచ్చాపాటి మాటాడుకుంటూండగా వాసంతి హడావిడిగా వచ్చింది

"పాపం! ...మాలతికి ఫిట్టొచ్చిందిట. డాక్టరుకి కబురంపారు. ఇంకా స్పృహరాలేదు. రండి. చూచి వద్దాం" అన్నది.

ఈ వార్త వినగానే మూర్తి, నేనూ గబగబా బయటకు వచ్చాం వాసంతితోపాటు. వరండాలో కాలుకాలిన పిల్లిలా ఆదుర్దాగా తిరుగుతున్నాడు లాయరు. మమ్మల్ని చూస్తూ అన్నారు.

"అబ్బే.. ...మరేం ఎర్వాలేదండి. నాలుగు రోజుల్నుంచీ ఆ పిల్లకి వంట్లో బావుండలేదు. అందుచేతనే ఇలా జరిగింది. మరో అయిదు నిమిషాల్లో కోలుకుంటుంది లెండి."

రాజ్యం బాబిగాడ్ని ఎత్తుకుని బయటకు వచ్చింది "ఫర్వాలేదు. ఇప్పుడే స్పృహలోకి వచ్చింది"

"చూశారా.. ....నే చెప్పలేదు. నాలుగురోజుల్నుంచీ నలతగా ఉన్నది అంతే." అన్నారు లాయరు నవ్వు తెచ్చుకుంటూ.

తర్వాత కాసేపు మాటాడి విడిదింటికి వచ్చాము. 'మాలతి కెలా వున్నది?' అని నోరు తెరుచుకు అడక్కపోయినా, సారధి ముఖవళికలు అడిగాయి.

"నాలుగు రోజుల్నుంచి ఆ అమ్మాయి









# వుడ్‌వార్డ్సు
**'గ్రైప్ వాటర్'**

తెలివైన తల్లులు
50 ఏళ్లనుంచి వాడుచున్నారు

అధికారయుత ఏజెంట్లు : థామస్ మేన్యుఫేక్చరింగ్ కెమిస్ట్స్ లిమిటెడ్ బొంబాయి; ఎమ్.జి. సహాని అండ్ కో., (కలకత్తా) ప్రైవేట్ లిమిటెడ్ కలకత్తా; టి.టి. క్రిష్ణమాచారి అండ్ కో., మద్రాస్; ఎమ్.జి. సహాని అండ్ కో. (ఢిల్లీ) ప్రైవేట్ లిమిటెడ్, ఢిల్లీ.

Aiyars OP. (48 TEL)


# సారథి

సుస్తీగా ఉన్నదిట. అంతే. మరేంపర్వాలేదు. ఇప్పుడు కులాసాగా ఉన్నది" అన్నాడు మూర్తి.

—నెలలు గడిచాయి.

రొటీన్లో పడిపోయాం. ఆఫీసూ, ఇల్లూ—అప్పుడప్పుడూ ఉత్తరాలద్వారా మిత్రుల క్షేమ సమాచారములు కనుక్కోడం. ఇప్పుడు సారథి గురించి వర్రీ అవడం మానుకున్నాం.

రెండురోజులకి రాజ్యం పుట్టింటికి వెడు తున్నదనగా మూర్తిదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

"త్వరలో కోడలుపిల్ల పుట్టబోతున్నట్లు తెలి సింది. సంతోషం కానీ—వరేయ్ రావూ—ఈ సంగతి తెలిసిందగ్గర్నుంచీ మీ చెల్లాయి కింద నడవటం లేదనుకో ఎప్పుడూ ఆమె ఆలోచనలన్నీ పుట్ట బోయె కోడలిపిల్ల గురించేను. పైగా— మాటా మంచీ తెలీని పసివాడికి పదేపదే హెచ్చరించి చెప్తుంది. 'నీకు పెళ్లాం పుట్టబోతోందిరోయ్' అని. ఈ ఆడవాళ్లు బొత్తిగా అల్పసంతోషులోయ్. సారథిగురించి విషయాలు తెలీడంలేదు. నీకు తెలిస్తే రాయి."

ఈ ఉత్తరం తీసుకెళ్ళి రాజ్యం కిచ్చాను చదవ మని. ఆమె చదివింది. సిగ్గుతో తన గదిలోకి పారి పోయింది.

—రాజ్యాన్ని రైలెక్కించాను. రైలు కదు ల్తూండగా అన్నాను. "త్వరతో శుభవార్త రాయి; అల్లుడి తల్లి తండ్రులకి చెప్పాలి. ఏం?"

"పోదురూ."

"కొంపతీసి మగపిల్లవాడ్ని కనేవు. మనవాడు అల్లుడికి మొగుడై పోగలడు. ప్రమాదం."

"అబ్బ......చాల్లేగాని. .. మీ ఆరోగ్యాన్ని జాగ్ర త్తగా చూచుకోండిబాబు. హోటలు భోజనం మీ కసలు పడిచావదు చేతులు కాల్చుకోడం నేర్చు కోండి. ఏం?"

"అహా......రాణిగారి ఆజ్ఞ."

రైలు వెళ్ళిపోయింది. రాజ్యంలేని ఇల్లు బోసి పోయివున్నది. మూర్తికీ, సారథికీ ఉత్తరాలు రాశాను.

* * *

పదిహేనురోజులు ఇలా గిర్రున తిరిగాయో లేదో మూర్తిదగ్గర్నుంచి ఓ చిత్రమైన ఉత్తరం వచ్చింది.

"మొన్నీమధ్యనే సారథిదగ్గర చదువుకున్న కుర్రాడికి మా ఆఫీసులో ఉద్యోగం వచ్చింది. మాటల్లో మనవాడి సంగతి అడిగాను. అతను చెప్పింది విం టూంటె నమ్మాలో, నమ్మకూడదో తెలీడంలేదు. సారథి అక్షరాలా 'హైడ్'లా తయారయ్యాడుట. చూసివద్దామనుకుంటె తీరుబడిలేనంత ఆఫీసు పని నన్నొదిలిపెట్టేట్టు లేదు. నువ్వే వీలుచేసు కుని ఒకసారి సారథిని చూచిరా. వచ్చింతర్వాత ఉత్తరం రాయి."

ఇది చదివి ఆశ్చర్యపోయాను. ఈ విపరీత పరి ణామాన్ని ఓ పట్టాన నమ్మలేకపోతున్నాను. పెళ్లి అవుతే సారథి మళ్లీ మనిషిగా ఉంటాడను కున్నాం. ఇలా ఊహించలేకపోయాం. ఎందు కయ్యిందిలా?

**ఆ తర్వాత రోజున సెలవుపెట్టి బయలు దేరాను. ఇంటికి చేరుకునేసరికి బాగా చీకటిపడింది.**

ఇంటిముందు రిక్షాదిగి తలుపు తట్టాను. తలుపు తెరుచుకుంది. మాలతి నాముందు నిలబడివున్నది. నన్ను సరిగ్గా పోల్చుకోలేదు కాబోలు—నన్ను చూడగానే తత్తరపాటు చెందింది. నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"రండి.....ఇంకా ఎవరో అనుకున్నాను" అంది నవ్వుతూ.

లోపలికెళ్ళి కూర్చుంటూ అడిగాను.

"సారథి లేడా?"

"బయటకు వెళ్ళారు. ఇప్పుడే వస్తారు. ఒక్క క్షణం..... నే నిప్పుడే వస్తాను" అంటూ ఆమె వంటగదిలోపలికి వెళ్ళింది.

టీపాయ్‌మీదవున్న పత్రిక చేతుల్లోకి తీసుకున్నాను. పేజీలు తిప్పుతున్నానన్నమాటేగాని, చదవ బుద్ధిపుట్టడంలేదు. మాలతిని చూస్తేనే నాకు ఆశ్చర్యమయ్యింది.

ఆమె బాగా పాలిపోయిఉన్నది. ఆరోగ్యం దెబ్బతిన్న మనిషిలా నీరసంగా ఉన్నది. పెళ్ళినాటికళ ఆమెలో ఇప్పుడు కనుపించడంలేదు. మాలతి గర్భవతి గూడాను.

ఓ పదినిమిషాల్లో మాలతి వంటగదినుంచి బయటకు వచ్చింది.

"హాకు మీగురించి చాలా చెపుతుంటారు" అన్నది.

నేను నవ్వాను.

"మిమ్మల్ని పెళ్ళినాడు చూచానంతే. అందరూ కులాసాయేనాండి?"

"ఆహా.....అవుతే వాడు ఇప్పటివరకూ ఇంటికి రాకుండా బజార్లో ఏం చేస్తున్నట్టు?"

"స్నేహితులతోపాటు తిరుగుతున్నారు కాబోలు"

"ఎంత స్నేహితుడైతేమాత్రం ఇంత ఆలస్యంగానా రావటం"

ఆమె పేలవంగా నవ్వింది.

సారథి గురించి మూర్తి రాసింది నిజమా కాదా అని అడుగుదామనిపించింది. కాని—ఎలా మొదలు పెట్టాలో తెలీక రెండు మూడు నిమిషాలు మవునం వహించాను. ఆమె గూడా ఏం మాటాడలేదు. చివరికి నేనే మాటాడించక తప్పిందికాదు.

"ఈమధ్య వీ డసలు ఉత్తరాలు రాయడమే మానుకున్నాడులా ఉన్నది? కారణం తెలీదు. అదీగాక వీడి గురించి చెడుగా గూడా విన్నాను"

ఈమాట ఆమెను కలతపెట్టిందో ఏమో తెలీదుగాని, చివాలున లేచింది. "వేన్నీళ్ళు దొడ్లో పెడ్తాను. స్నానం చెయ్యండి" అన్నది.

మాలతి పద్ధతి చూస్తూంటే—వాడి విషయం కావాలని దాస్తుందనిపించింది. స్నానం ముగించాను.

భోజనం చెయ్యమని అడిగింది మాలతి. వాడు వచ్చేవరకూ ఉంటానని చెప్పాను.

నాకు కేటాయించిన గదిలో కూర్చుని సిగరెట్టు కాలుస్తూ సారథి గురించి ఆలోచించడం ప్రారంభించాను. తొమ్మిదిన్నరయినా వాడు రాలేదు. రోజూ ఇంతే కాబోలు!

పదిగూడా అయింది. రాలేదు. అప్పటికే రెండుమూడుసార్లు నన్ను భోజనానికి పిలిచింది మాలతి. కాని వాడు వచ్చేంతవరకూ భోజనం చెయ్యనని చెప్పాను. నన్ను భోజనం చెయ్యమని అడుగుతుందేగాని వాడు ఆలస్యంగా రావటానికి కారణం మాత్రం చెప్పటంలేదు.

పది దాటింతర్వాత కాబోలు — 'ఫెడీ'మని శబ్దం వినిపించింది. ఉలిక్కిపడి గబగబా వాగది గుమ్మందగ్గరకొచ్చి నిలబడ్డాను.

సారథి వచ్చాడు!

తలుపుని విసురుగా లాగి కొట్టాడు. నడువబోయాడు. కాని పట్టుతప్పిందికాబోలు వరండాలో వున్న బల్లమీద పడబోయాడు. అంతలోనే చేతులతో బల్లని పట్టుకున్నాడు. 'ఫ్లవర్‌వాజ్' చేతికి తగిలింది. 'వాజ్'లో పూలు ఓచేతిలోకి తీసుకున్నాడు. మరోచేతితో వాజ్‌ని విసిరి అవతలకు గిరవాటువేశాడు. పూలని చేత్తో నలిపి కింద పారేశాడు.

తర్వాత తనకు ముందున్న గదిలోకి నడిచాడు తూలుకుంటూ. చక్కగా డిజైన్ వేసివున్న డోర్‌కర్టను ముఖానికి అడ్డుపడింది. కోపం వచ్చింది కాబోలు — కర్టన్ లాగి చించిపారేశాడు. గబగబా తనగదిలోకి వెళ్ళిపోయాడు.

ఒక నిమిషంపాటు నిశ్శబ్దం. తర్వాత చెవులు బద్దలయ్యేంత ఫుల్‌వాల్యూమ్‌లో రేడియో ఆన్‌చేశాడు. అలా ఓక్షణంపాటు జరిగింతర్వాత సడన్‌గా ఆఫ్‌చేశాడు.

ఇదంతా చూస్తూంటే ఆశ్చర్యంగావుంది. ఏమిటి వీడు ఇలా తయారయ్యాడు? సారథి నిజంగానే 'హైడ్' అయ్యాడా?

నాకు ఎదురుగావున్న గదిగుమ్మందగ్గర మాలతి కళ్లలో నీళ్ళునింపుకుని నిలబడింది. అప్పుడప్పుడు జాలిగా నావంక చూస్తుంది.

ఇంక సారథి వింతచేష్టలు చూడలేకపోయాను. గబగబా వాడిగదిలోకి వెళ్ళాను. వాడు నారాకను గమనించలేదు. కిటికీదగ్గర అటువైపు తిరిగి నిలబడి ఉన్నాడు.

"సారథి." పిలిచాను.

గిరుక్కున వెనక్కుతిరిగి చూశాడు. వాడిచేతిలో గ్లాసువున్నది. నన్ను చూడగానే ఆశ్చర్యపోయాడు. చేతిలోని గ్లాసు కిటికీలోపెట్టాడు. మూతి తుడుచుకున్నాడు. కొన్నిక్షణాలవరకూ బొమ్మలా నిలబడి తర్వాత నిమ్మదిగా అన్నాడు.

"ఎప్పుడు వచ్చావ్?"

"వచ్చి చాలాసేపయింది. నువ్వు దారుణంగా మారిపోయావని తెలిసింది. అదెంతవరకు నిజమో తెలుసుకుందామని వచ్చాను. ఇప్పటివరకూ నువ్వు చేస్తున్న పిచ్చిచేష్టలు చూశాను."

వాడు పేలవంగా నవ్వాడు. కొంత నిర్లక్ష్యంగా ఉన్న దానవ్వు. దగ్గరకు వెళ్ళాను. కిటికీలో సీసా, గ్లాసూ చూశాను.

"ఏమిటిదీ?"

"అబ్బే.... ఏంలేదు." వాడు మాటాడుతూంటే గుప్పున వాసనకొట్టింది.

సారథి తాగివున్నాడు. నాలో కోపం కట్టలు తెంచుకున్నది. వాడి చెంపమీద ఫెళ్ళున ఓపెట్టు పెట్టాను.

సారథి తలదించుకున్నాడు. చేతితో చెంపను తడుముకుంటున్నాడు.

"నే విన్నది నిజమని ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. ఎందుకిలా దిగజారిపోయావ్?"

వాడు నా కళ్ళలోకి తిన్నగా చూశాడు. జవాబు చెప్పలేదు.

"నీతిపాఠాలు ఇన్నాళ్ళు బోధించినవాడివి—నువ్వెందుకిలా మారావ్?"

వాడి కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి.

"ఛీ .... పైగా కన్నీరెందుకోయ్. నటన. తాగడం — ఇన్ని పిచ్చివేషా లెయ్యడం, ఇవన్నీ ఎవడో భ్రష్టుడు చెయ్యాల్సినపనులు. నీ కేం తక్కువైందని ఇలా తయారయ్యావ్. సిగ్గులేదు."

అప్పటిగ్గూడా వాడు మాటాడలేదు.

"చాలిది. నువ్వు మళ్ళీ మా సారథిలా మారినవాడు ఈ గడప తొక్కుతాను. అంతవరకూ నువ్వు నాకూ, నేను నీకూ దూరంగా ఉండాల్సిందే. వస్తాను." అని బయటకు నడిచాను.

మాలతి తనముఖాన్ని చేతుల్లోదాచుకుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది. పాపం!— వాడి ఈ చర్యతో ఆమె ఎంత కృంగిపోయిందో!

ఇంటికి వచ్చి, సారథి పరిస్థితి తెలియజేస్తూ మూర్తికి ఉత్తరందాశాను. చివరికి మా సారథి భ్రష్టుడయ్యాడు.

ఇలా అవుతాడని కల్లోకూడా తలవలేదు.

* * *

మా ఆఫీసరు ట్రాన్స్ఫరై వెడుతూంటే— ఆయన్ను స్టేషనువరకూ సాగనంపటానికి వెళ్ళాను. ఆయన కంపార్టుమెంటులో కాలుపెట్టినతర్వాత ఆయనదగ్గర సెలవుపుచ్చుకుని వచ్చేస్తూండగా ఓ కంపార్టుమెంటులో మాలతి కనుపించింది. ఆశ్చర్యపోయాను. గబగబా అక్కడకు వెళ్ళాను.

"ఏమి టిలా బయలుదేరారు?" అనడిగాను. ఆమె కొంత చలించింది. జవాబుమాత్రం చెప్పలేదు.

"మా సారథి రావడంలేదా?"

"ఊహూ......రావడంలేదు."

"తెనాలి వెడుతున్నారా?"

"ఊ......"

"మావాడిపద్ధతి ఇంకా అలాగే ఉన్నదా?"

"దానికి కారణం నేను" అన్నది గాద్గదికంగా. ఉలిక్కిపడ్డాను.

"తప్పు చేసింది నేను. ఆయన చాలా మంచివారు. ద్రోహం చేశాను. ఆయన మనసు పాడుచేశాను."

దీంతో మరింత ఆశ్చర్యం కలిగింది.

"ఆయన్ను క్షమించండి. ఆయన్ను బాగుచేసే భారం మీ మీదనే వదలిపెడ్తున్నాను" అన్నది ముఖం అటువైపు తిప్పుకుని.

రైలు కదిలి వెళ్ళిపోయింది!

ఆమె వింతవాగ్ధోరణిని ఆలోచిస్తూ ఇంటికి వచ్చాను. ఎన్నో ఆలోచనలు. ఒక్కదానికీ సరైన రూపంలేదు. మాలతి ఎందుకిలా అన్నది? మా సారథి మారిపోటానికి ఎలా కారణమైనది? మాలతి మావాడికి చేసిన ద్రోహం ఏమిటి? అక్ష యక్ష ప్రశ్నలు—

—వారంరోజులు గడిచాయో లేదో మూర్తి ఓనాడు మా ఇంటికి వచ్చాడు. వెంటనే సారథి దగ్గరకు వెడదాం పదమని తొందరపెట్టాడు. అసలు జరిగిందేమిటో చెప్పమన్నాను. సారథి వాడి ఉద్యో

## క్యాలెండర్లు

నాణ్యమైన ఫోటో ఆఫ్‌సెట్ క్యాలెండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలెండరు బొమ్మలను క్యాలెండరు మ్యాను ఫ్యాక్చరర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము.
మంచికమీషను పెపని చేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి.

ELITE CALENDAR Co.,
P. B. 1927, MADRAS-1

## పొడుగు పెరగండి



సరిక్రొత్త దేహపరిశ్రమలు ఆహార నియమములు పాటించి, పొడుగు పెరిగి, ఆరోగ్యవంతులుగా ఉండండి. వివరములు ఉచితముగా పంపబడును.

TOTAL HEALTH FOR ALL
283, Azad Market (A. P. M.)
Delhi.

పండిత
డి.గోపాలాచార్యులవారి

## అరుణ

స్త్రీల ఆరోగ్యసౌభాగ్యాలకు

ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు-17

## శ్రీబాలాంజనేయ ప్రశ్న

సంతానము, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలించిన సొమ్ము, వీడిపోయినభార్య మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలను. రూ 2 ఎం.ఓ. చేయండి. నెలవారీ గా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము రూ 2. పూర్తి పేరు, జాబు వ్రాసిన టైము తెలిపిన చాలును.

హనుమాన్ జ్యోతిషాలయము,
10వ లైను,అరండల్ పేట, గుంటూరు2.


# సారధి

నికి రాజీనామారాసి ఇచ్చాడుట. అదిరిపడ్డాను. మూర్తితోపాటు సారధి దగ్గరకి ఆక్షణమే బయలు దేరాను.

సారధి ఇంటికి తాళంవేసి ఉన్నది. గబగబా వాడి కాలేజికి వెళ్లాము. రాజీనామా ఇవ్వడానికి కారణమేమిటని అడిగాము. వాళ్లు చెప్పింది వింటూంటే నమ్మాలో, నమ్మకూడదోననిపించింది.

వాడు ఈమధ్య చాలా అసభ్యంగా ప్రవర్తించాట్ట. విపరీతంగా తాగి, క్లాసులకు వచ్చేవాట్ట పిచ్చిగా తనిష్టంవచ్చినట్టు పాఠం చెప్పేవాట్ట విద్యార్థులు ఈ చర్యని అరికట్టమని యాజమాన్య సంఘానికి తెలియజేశారుట. ఒకటికి రెండుసార్లు వాళ్లు సారధిని హెచ్చరించారుట గూడాను చదువు కున్నవాళ్లు, పదిమందికి చెప్తున్నవాళ్లు, సంస్కారమూ, సభ్యతా తెలిసినవాళ్లు ఇలా చెయ్యడం తగదని మందలించారుట. మరోసారి ఇలా జరుగుతే తగుచర్య తీసుకోడం జరుగుతుందని హెచ్చరించారుట. రెండురోజుల్క్రితం తను ఇలాటి పవిత్రమైన ఉద్యోగానికి తగనని రాజీనామా రాసి ఇచ్చాట్ట. అంత మంచిమనిషి ఇంత దారుణంగా మారినందుకు ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉన్నదని చెప్పారు

నీతిగా బ్రతకడమే తన ధ్యేయంగా పెట్టుకున్న మా సారధి దిగజారిపోయాడు. తాగుడు నేర్చుకున్నాడు అసభ్యంగా ప్రవర్తించాడు

వాడు ఏకారణం లేకుండా ఇంత హఠాత్తుగా మారిపోడు. ఏదో కారణం ఉండిఉంటుంది. అదేమిటి?

ఆ రాత్రికి రాత్రే తిరుగుప్రయాణం పట్టాము మేము ఇల్లు చేరుకునేసరికి మా పక్కింటాయన వచ్చారు.

''ఎవరో సారధిట. మీరు వచ్చినతర్వాత ఈ ఉత్తరం ఇవ్వమని చెప్పివెళ్ళాడు. తీసుకోండి'' ఉత్తరం ఇచ్చి వెళ్ళిపోయారు.

ఉత్తరాన్ని ఆత్రంగా విప్పి చదివాను. కుప్పలా కూలిపోయాను.

డియర్ రావ్;

నా కథ ఇప్పటికి చాలావరకు తెలుసుకునేఉంటావు. నే నిలా మారిపోయినందుకు కారణం తెలీదు నీకు

ఒక మలుపులో కాకపోయినా, మరో మలుపులో నైనా సుఖిద్దామన్న ఆశకొద్దీ పెళ్లి చేసుకున్నాను నే నింత దిగజారిపోయినందుకు ఒకవిధంగా మాలతి కారణం. ఇది నిందమాత్రం కాదు.

మాలతిని 'క్షమించ' కలిగే సహృదయం నాకున్నది. నన్ను నేను శిక్షించుకోడం పొరపాటె. అయినా ఇది నా బలహీనత. తప్పదు మరి.

నీతికి, కట్టుబాట్లకు దూరంగా తిరిగే మనుష్యులంటె నాకు గిట్టదని నీకు తెలుసు. మీ కందరికీ కష్టం కలిగించే ఈ సెంటిమెంటు చివరికి నా జీవితాన్నే పాడుచేసింది దీనికితోడు ఎన్నాళ్లనుంచో మరుగుపడ్డ వ్యక్తిగతమైన బలహీనత తోడయ్యింది. ఫలితం ఈనాటి నేను!

పెళ్ళయిన మొట్టమొదటిరోజున మాలతికి ఫిట్టు వచ్చింది. అప్పటికి మావయ్య ఏదో సర్దిచెప్పాడు. ఆరోజు గడిచిపోయింది. అది లగాయితూ నేటివరకూ ఆమెకు తరచూ సరిగ్గా అలాంటి ఫిట్స్ రావడం జరుగుతుంది.

ఇది 'ఫిట్టని' చెప్పటం భావ్యం కాదేమో.....

ఒకనాటి అమావాస్యచీకటిలో ఆమె శీలాన్ని ఒక పెరికివాడు హరించాడు. మాలతిని మాయమాటలుచెప్పి లొంగదీసుకున్నాడు. ఇప్పు డామె గర్భంలో పెరుగుతూన్న పాప ఆ దుర్మార్గుడిదేను.

ఈ రహస్యం నాదగ్గర చాలాకాలం దాచింది మాలతి. ఒకనాడుగూడా ఆమె నాకు భార్యగా ఉండలేదు. అధవా—ఉండాలనుకున్నా, వెంటనే 'ఫిట్టు' వచ్చేది ఆతర్వాత స్పృహవచ్చిన తర్వాత కన్నీరు పెట్టుకునేది

ఓ నాడు తప్పనిసరై చెప్పుకుంది అంతే— మామధ్య అనుబంధం తెగిపోయింది

మానసికంగా బాధని అనుభవించాను ఆమె నాకు నివేస్తేనేచాలు. నిలువెల్లా కంపించిపోయేవాడ్ని. సాధ్యమైనంతవరకూ ఆమెకూడా నానుంచి తప్పించుకు తిరిగేది.

ఇలా ఎన్నాళ్ళు సాగిస్తాం మా సంసారం?

అయిపోయింది. ఎన్నో కలలుకని, ఆశలు పెంచుకున్న పచ్చటి జీవితం బీటలువారింది.

మాలతిమీద అసహ్యం రోజురోజుకీ పెరిగిపోతున్నది ఆమె నాకు చెప్పకపోతే—నా కథ మరోలా జరిగేదేమో. కాని ఆమె చెప్పింది! అందుకోసమైనా ఆమెను 'క్షమించాల్సిన' బాధ్యత నాకున్నది.

అయితే నా మనసు కేమి సమాధానం చెప్పుకోను? తాగడం నేర్చుకున్నాను ఇష్టం వచ్చినట్టు తిరగడం మొదలుపెట్టాను.

ఇదే నాలో ఇన్నాళ్ళూ దాగిన బలహీనత! ఈనాడు ఇలా విజృంభించింది.

చాలామందిలోలేని విశిష్ట గుణాలు నాలో ఉన్నందుకు గర్వించేవాడిని పోగడ ఇప్పుడు వాటికి రాజీనామా ఇచ్చాను.

అందరికంటె తక్కువగా బ్రతుకుతున్నాను.

మొన్నీమధ్యనే మాలతి వెళ్లిపోయింది. వాళ్లనాన్నగారింటికి వెళ్ళిందేమో అనుకున్నాను. కాని— అక్కడకూ్కడా రాలేదుట. అప్పుడప్పుడూ అనేది. 'మీలాటి పవిత్రులదగ్గర నాకు చోటులేదు. ఇలా బ్రతకలేన'ని.

పాపం —ఎక్కడో ఓ మారుమూల దిక్కుమాలిన చావుకి నోచుకుందేమోనని అనుమానం నాకు.

నేనూ వెడుతున్నాను. తీర్థయాత్రలవల్ల సుఖం లభిస్తే --అదే నాజీవితానికి చివరిసుఖమనుకుంటాను అదీకాకపోతే ఈ పాడుబ్రతుక్కి అతి త్వరలోనే స్వస్తి పలుకుతాను.

చివరిసారిగా మిమ్మల్ని కలుసుకోలేకపోయినందుకు చింతగా ఉన్నా, ఒకవిధంగా సంతోషిస్తాను. ఏమంటె —ఈ స్థితిలో నా ముఖం మీకు చూపించడం నా కిష్టంలేదు. సెలవింక.

మీ
సారధి.

ఉత్తరం చదవడం పూర్తయిన తర్వాత మూర్తికి ఇచ్చాను చదవమని. వాడు చదివి కళ్లనీళ్లు నింపుకుంటూ అన్నాడు. ''మనవాడు అనుభవించడానికి పుట్టలేదురా రావ్!''

అదే అనిపించింది నాకూను. ★